క్లుప్తంగా

రాములోరి కల్యాణానికి ఆలయాలు ముస్తాబు

నేడు శ్రీరామ నవమి



విద్యుత్‌ దీపాలతో ముస్తాబైన సీతారాంపూర్‌ ఆలయం

షాబాద్‌: శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలకు మండలంలోని ఆయా దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని సీతారాంపూర్‌, తాళ్లపల్లి, ఆస్పల్లిగూడ, సర్దార్‌నగర్‌, షాబాద్‌, మన్‌మర్రి గ్రామాల్లోని దేవాలయాలను విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. సీతారాంపూర్‌, తాళ్లపల్లి, ఆస్పల్లిగూడ, షాబాద్‌ గ్రామాల్లో ఉదయం 11 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. భజన కార్యక్రమాలతో శ్రీరామనవమి ఉత్సవాలు పూర్తవుతాయన్నారు.

సీతారాములకు మంగళ స్నానాలు



స్వామివారి కొట్నం వేడుకల్లో పాల్గొన్న విశాల

షాద్‌నగర్‌టౌన్‌: శ్రీరామ నవమిని పురస్కరించుకొని పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సీతారాముల కల్యాణం నేపథ్యంలో బుధవారం కొట్నం, మంగళ స్నానాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్‌ కమిటీ చైర్‌పర్సన్‌ విశాల, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అధికారం కాంగ్రెస్‌దే

టీపీసీసీ సెక్రటరీ ప్రవీణ్‌యాదవ్‌



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌

కొత్తూరు: వచ్చే ఎన్నికల్లో కేంద్రం, తెలంగాణలో కాంగ్రెస్‌ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని టీపీసీసీ సెక్రటరీ ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్‌ అన్నారు. హాత్‌సేహాత్‌ జోడో యాత్రలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని సిద్ధాపూర్‌, పెంజర్ల, కొడిచర్ల, ఎస్‌బీపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్‌, బీజేపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే, కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి గురించి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

కేశంపేట: ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లేమామిడి గ్రామ శివారులోని గాంధీశంకర్‌పల్లి, బోధునంపల్లి, చౌలపల్లి, సంతాపూర్‌ గ్రామాల్లో బుధవారం ధ్యానంపైన అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఆంజనేయరెడ్డి తెలిపారు. నిత్యం ధ్యానం చేయడం వల్ల గుండెజబ్బులు, బీపీ, షుగర్‌ వ్యాధులను తగ్గిస్తుందని ఆయన తెలిపారు. శాఖాహారంలో మాంసహారంలో కంటే మూడు రెట్లు ప్రొటీన్లు, విటమిన్లు అధికంగా ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, శివకుమార్‌, వెంకటలక్ష్మి, శైలజ, లక్ష్మి, జ్యోతి, సురేష్‌రెడ్డి, జంగయ్య, వేణు, రాములు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరుకు సంగ్రామ యాత్ర

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర బుధవారం కొత్తూరుకు చేరుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు జనార్దన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌ జిల్లా అలంపూర్‌ పట్టణం నుంచి ప్రారంభించిన యాత్ర కొత్తూరు పట్టణానికి చేరుకోవడంతో నాయకులు స్వాగతం పలికారు. పార్లమెంట్‌ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా ఇన్‌చార్జి యాదగిరి, కన్వీనర్‌ రాజు, షాద్‌నగర్‌ ఇన్‌చార్జి అనంతయ్య, నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- జీఓ 58 కింద పేదలకు పట్టా సర్టిఫికెట్లు
- షాదీముబారక్‌, సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ



పట్టా సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్రం వచ్చిన తరువాత బీఆర్‌ఎస్‌ పేదల పక్షపాత ప్రభుత్వంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మండలంలో జీఓ 58కింద ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఇంటి పట్టా సర్టిఫికెట్లు, పలువురికి షాదీముబారక్‌, సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎంఎస్‌ చైర్మన్‌ పి. క్రిష్ణారెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, ఎంపీపీ విజయలక్ష్మిలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను పేదలకు అందజేస్తున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమని చెప్పారు. ప్రభుత్వ భూమిలో నిరుపేదలు ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా ఇళ్లు కట్టుకొని ఉంటున్న వారికి జీఓ 58 కింది 120 గజాల స్థలం ఉన్న వారికి దరఖాస్తులు చేసుకుంటే ఉచితంగానే పట్టా సర్టిఫికెట్లు అందిస్తుందని చెప్పారు. 120 గజాల కంటే ఎక్కువగా ఉన్న వారు జీఓ 59 కింది చాలన్‌ కట్టి దానిని క్రమబద్ధీకరించుకునే అవకాశం కూడా కల్పించిందన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ప్రతి పేదింటి ఆడపిల్లలకు ప్రభుత్వం అండగా ఉంటూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ పథకాలను అందించి అండగా నిలుస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్‌ పేదల సమస్యల దగ్గరి నుంచి చూసిన వ్యక్తిగా ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరించి అందరికి న్యాయం జరిగేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జరగాలనే ఆలోచన మన సీఎం కేసీఆర్‌కు రావడంతో టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, ఎం. క్రిష్ణారెడ్డి, తోట చంద్రశేఖర్‌, నాగార్జున్‌రెడ్డి, వెంకటేశ్‌, మహేశ్‌, గని, నరేందర్‌, శేరి రాజు, ఎదిరే రాములు, మల్కాపూర్‌ రవి, ఫయాజ్‌ దయాకర్‌, రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

కొత్తూరు: జీఓ నం.58 ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 జూన్‌02 కంటే ముందుగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టిన వారికి తమ స్థలాలను జీఓ నంబర్‌ 58 ద్వారా క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మొదటి విడతగా ఫరూఖ్‌నగర్‌ మండలంలో-06, కొత్తూరు-02, నందిగామ మండలంలో ఒకరికి పట్టా సర్టిఫికెట్లను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ గణేష్‌, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ శోభ, కొత్తూరు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లావణ్య, ఆర్డీఓ రాజేశ్వరి, తహసీల్దార్‌ రాములు, నాయకులు దేవేందర్‌యాదవ్‌, సత్యనారాయణ, విఠల్‌, మధుసూదన్‌రావు, పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

కొత్తూరు: కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ ఎల్లప్పుడు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రాధాగార్డెన్‌ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇతర పార్టీల్లో కార్యకర్తలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని అన్నారు. పదవుల కంటే పార్టీ పటిష్టత కోసం కృషి చేసే కార్యకర్తలకు బీఆర్‌ఎస్‌ తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. దేశంలోనే తెలంగాణ ఆదర్శరాష్ట్రంగా అభివృద్ధి చెందడంలో కార్యకర్తల కృషి ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లావణ్య, వైస్‌ చైర్మన్‌ రవీందర్‌, వైస్‌ ఎంపీపీ శోభ, మండలపార్టీ అధ్యక్షుడు మెండెకృష్ణ, నాయకులు దేవేందర్‌యాదవ్‌, సత్యనారాయణ, కోస్గి శ్రీనివాస్‌, కోస్గి భగీరథ, యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు



నాటక ప్రదర్శనలో కళాకారులు

షాద్‌నగర్‌రూరల్‌: మండల పరిధిలోని చింగోడ్‌ గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బుధవారం పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ వారి ఆధ్వర్యంలో కళాకారుడు వడ్ల రమేష్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మోహినీ భస్మాసుర నాటకంలో భస్మాసురుడిగా వడ్ల రమేష్‌చారి, నారదుడిగా ఆంజనేయులు, శివుడిగా ప్రశాంత్‌చారిలు నటించారు. అదే విధంగా రామాంజనేయ యుద్ధ నాటకంలోని యుద్ధ సన్నివేశంలో శ్రీరాముడిగా వీరాచారి, ఆంజనేయుడిగా వడ్ల రమేష్‌చారి, నటించారు. వీరి పద్య పఠనాలు, నటన, అందరిని ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బాలమణి, ఫిల్మ్‌ సెన్సార్‌ బోర్డు సభ్యుడు టీవీ రంగయ్య, కళాకారుడు డాక్టర్‌ రంగనాథం, సింగారం శ్రీనివాస్‌, సాయిలక్ష్మి దామోదర్‌, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌, పట్వారీ వ్యవస్థ రద్దు ఘనత ఎన్టీఆర్‌దే

టీడీపీ నాయకుడు కొమ్మిడి వెంకట్‌రెడ్డి



టీడీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న నేతలు

మొయినాబాద్‌: ఉమ్మడి రాష్ట్రంలో పటేల్‌, పట్వారీ వ్యవస్థను రద్దుచేసి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుదేనని టీడీపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం మొయినాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి ఎన్టీఆర్‌ సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్టీఆర్‌ పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి ప్రజలకు సేవచేశారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించింది ఎన్టీఆరేనని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు పద్మారావు, మండల పార్టీ కన్వీనర్‌ యాదయ్యగౌడ్‌, నాయకులు భిక్షపతియాదవ్‌, షాబాద్‌ మాణిక్యం, ప్రవీణ్‌, వెంకటేష్‌, నరహరి, రాఘవరెడ్డి, ఇంద్రారెడ్డి, విష్ణుకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్డీఓ వేణుమాధవ్‌కు సన్మానం



ఆర్డీఓను సన్మానిస్తున్న సిబ్బంది

చేవెళ్ల: సివిల్‌ సర్వీస్‌ అథ్లెటిక్‌ చాంపియన్‌ షిప్‌ 2022-23లో భాగంగా అండర్‌ 50 లెవల్‌లో ట్రిబుల్‌జంప్‌ క్రీడల్లో చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుధవారం చేవెళ్ల రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆర్డీఓ వేణు మాధవ్‌రావును సన్మానించారు. ఈనెల 26, 28 తేదీల్లో అండర్‌ 50 లెవల్‌ ట్రిబుల్‌జంప్‌ క్రీడలు పూణే నగరంలో జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయి నుంచి దాదాపు 20 మంది ఉద్యోగుల్లో చేవెళ్ల ఆర్డీఓ వేణు మాధవ్‌రావు 6వ విభాగంలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లడం హర్షనీయమన్నారు. విజేతగా నిలువలేకపోయిన అక్కడి వరకు వెళ్లడమే విజయం సాధించనట్లుగా భావిస్తున్నామని అభినందించారు. ఆయనను సన్మానించిన వారిలో చేవెళ్ల తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఆర్‌ఐ రాజేశ్‌, ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్‌ కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రమాదేవి



ప్రతిజ్ఞ చేస్తున్న రమాదేవి, సర్పంచ్‌, టీచర్లు

షాబాద్‌: సమతుల్యమైన ఆహారాన్ని తీసుకున్నపుడే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రమాదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో సర్పంచ్‌ పెంటయ్యతో కలిసి పోషణ మాసం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు పోషకాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహరలేమితో తక్కువ బరువు ఉన్న శిశువు జన్మిస్తారన్నారు. గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల్లో రక్తహీనత లోపం తగ్గించడమే లక్ష్యంగా జాతీయ పోషకాహార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు గుడ్లు, పాలు, బాలామృతం, చిరుతిళ్లు అందిస్తూ నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు చిరుతిళ్లు, చిరుధాన్యాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సౌభాగ్య, ప్రమీల, ఏఎన్‌ఎం పెంటమ్మ, ఆశవర్కర్‌ స్వప్న తదితరులున్నారు.

నూతన నియామకం



రంజిత్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌గౌడ్‌, ప్రీతమ్‌, తదితరులు

చేవెళ్ల: కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్‌పార్టీ ఓబీసీ సెల్‌ రాష్ట్ర చైర్మన్‌ ఎన్‌ శ్రీకాంత్‌గౌడ్‌ అన్నారు. నగరంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఓబీసీ సెల్‌ రాష్ట్ర జాయింట్‌ కోఆర్డినేటర్‌గా మొయినాబాద్‌కు చెందిన రంజిత్‌కుమార్‌ను నియమించినట్లు ప్రకటించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీకోసం పనిచేసే వారిని పార్టీ ఎప్పుడు గుర్తుపెట్టుకుంటుందని తెలిపారు. పార్టీలో నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న వారికి శుభాకాంక్షలు తెలిపి పార్టీ పటిష్టత కోసం పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్‌ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవీ అప్పగించినందుకు, తన ఎంపికకు కృషి చేసిన నాయకులకు పార్టీ, ఓబీసీ సెల్‌ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ చైర్మన్‌ సోహేల్‌ బాయ్‌, ఎస్సీ సెల్‌ చైర్మన్‌ ప్రీతమ్‌, మైనార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట..

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



పరీక్షలను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని మండల ఎంపీపీ మధుసూదన్‌ రెడ్డి అన్నారు. మండలంలోని పెంజర్ల గ్రామంలో బుధవారం ఆయన సర్పంచ్‌ మామిడి వసుంధరమ్మతో కలిసి కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మిస్తున్న చిన్నారులకు కేసీఆర్‌ కిట్‌, బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలకు అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. గ్రామాల్లో పల్లె దవాఖానల ఏర్పాటుతో ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అంధత్వ నివారణలో భాగంగా కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందిస్తున్నట్లు వివరించారు. సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి వైద్యులు పలు ఆస్పత్రులకు రెఫర్‌ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ రమేష్‌, ఎంపీటీసీ అంజమ్మ, వార్డు సభ్యులు, స్థానికులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల పంపిణీ

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ



బల్లలు, బెంచీలు పంపిణీ చేస్తున్న రాఘవరావు

మొయినాబాద్‌రూరల్‌: పాఠశాలకు దాత దామర్ల రాఘవరావు బెంచీలు, బల్లలు పంపిణీ చేయడం అభినందనీయమని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్‌ పాఠశాలకు దాత దామర్ల రాఘవరావు దాదాపు 1.5 లక్షలతో పాఠశాలకు కావాల్సిన బెంచీలు, బల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శోభావెంకట్‌రెడ్డి పాల్గొని దాతతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహులుకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ..రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అందులో భాగంగా దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్దార్‌ నగర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ వెంకట్‌ రెడ్డి, ఉపసర్పంచ్‌ సిద్ధయ్య, పాఠశాల ప్రధానోపాధయ్యులు నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ జయలక్ష్మి



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

షాద్‌నగర్‌: గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ జయలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో చించోడ్‌, బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య ఆరోగ్య సిబ్బందికి కార్డియో పల్మనరీ రిససిటేషన్‌ (సీపీఆర్‌)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ జయలక్ష్మి మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో చాలా మంది గుండెపోటుకు గురవుతున్నారని అన్నారు. ఎవరైనా గుండెపోటుకు గురై ఇబ్బందిపడుతుంటే వారికి సీపీఆర్‌ చేయడం ద్వారా వారి ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. గుండెపోటుకు గురై కింద పడిపోయి మాట లేకుండా ఉన్న వ్యక్తిని తట్టి లేపినా లేవకపోయినట్లయితే సీపీఆర్‌ టెక్నిక్‌తో గుండెపై 30సార్లు గట్టిగా రెండు చేతులతో నొక్కాలని తెలిపారు. అదేవిధంగా నోటితో ఆక్సిజన్‌ అందించాలని అన్నారు. తద్వారా గుండె మళ్లీ పని చేస్తుందని చెప్పారు. ఇలా చేయడం ద్వారా గుండెపోటుకు గురైన మనిషి ప్రాణాలు కాపాడి వారికి జీవితాన్ని అందించిన వారవుతారన్నారు. ఆరోగ్య సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. గుండెపోటుకు గురైన వారిని ఈ పద్ధతితో ప్రాణాలు కాపాడే అవకాశాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ జోసఫ్‌ హెల్త్‌ ఎడ్యుకేటర్‌ శ్రీనివాసులు, హెల్త్‌ సూపర్‌వైజర్‌ మెర్లిన్‌, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పౌష్టికాహారం

ముదిగొండ మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

మొయినాబాద్‌ రూరల్‌: చిరుధాన్యాలతో పౌష్టికాహారం లభిస్తుందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌ ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు లక్ష్మి, కవితలు కలిసి బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులు మంజులతో పాటు చేవెళ్ల సీడీపీఓ శోభారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేటీ బచావో బేటీ పడావో నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, పప్పు దినుసులు ఆహారంగా తీసుకుంటే గర్భిణులు, కిషోర బాలికలకు ఎంతో బలమైన ఆహారమని సూచించారు. వీటిలో ఎన్నో పోషక విలువలు కలిగి ఉన్నాయని తెలిపారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో మహిళలు, గర్భిణులు, బాలింతలు పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్‌ నాగమణి, వార్డు సభ్యులు, ఏఎన్‌ఎం ఝాన్సీ, ఆశవర్కర్లు శివరాణి, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు కవిత, లక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మేహర్‌ఉన్నీసాబేగం, రాములు తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి



పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న గీతారెడ్డి

షాబాద్‌: వరి పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బోనగిరిపల్లి గ్రామాల్లో యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రస్తుతం వరి పంట పిలక దశ నుంచి పొట్ట దశలో ఉందని చెప్పారు. రైతులు అధికారుల సలహాలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు ఏఈఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశం, ఏఈఓ రాఘవేందర్‌, రైతులు ఉన్నారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

జేఎన్‌టీయూ ఫార్మాసిటికల్‌ సైన్సెస్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ సునీతారెడ్డి



గ్రాడ్యుయేషన్‌ డేలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సునీతారెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్‌: ఫార్మసీ విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యను, ప్రాక్టికల్స్‌ నిర్వహిస్తున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఈ సందర్భంగా డాక్టర్‌ ఆఫ్‌ ఫార్మసీ.. ఫార్మడి విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని జేఎన్‌టీయూ ఫార్మాసిటికల్‌ సైన్సెస్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ బి.సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌ సమీపంలో గల చిలుకూరు బాలాజీ ఫార్మసీ కళాశాలలో డాక్టర్‌ ఆఫ్‌ ఫార్మసీ(ఫార్మడీ)2016-2023 ఏడు సంవత్సరాల పాటు ఫార్మడి విద్యను అభ్యసించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌ డేను ప్రిన్సిపల్‌ శ్రీనివాస్‌రావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ ఫార్మాసిటికల్‌ సైన్సెస్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ సునీతారెడ్డి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఫార్మడి పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఫార్మసీ విద్యలో ఎంతో నైపుణ్యం ఉందని పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఔషధరంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సూచించారు. 2016-23 వరకు డాక్టర్‌ ఆఫ్‌ ఫార్మసీ చదివి పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించారు. ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఔషధ రంగంలో పరిశోధనలు చేసి కొత్త కొత్త వాటిని కనుగోనాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రయోగాత్మకమైన పరిశీలనలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌ చంద్రశేఖర్‌రావు బారు, కళాశాల మేనేజ్‌మెంట్‌ రమేష్‌బాబు, నర్సింహ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌ 1 నుంచి విలేజ్‌ టోర్నమెంట్‌ పోటీలు

చేవెళ్ల: ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి చేవెళ్లలో 'విలేజ్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌' నియోజకవర్గ స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.మల్లారెడ్డి తెలిపారు. చేవెళ్లలోని కేవీఆర్‌ గ్రౌండ్‌లో ఈ పోటీలు జరుగుతాయని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చేవెళ్లకు చెందిన కనకమామిడి వెంకట్‌రెడ్డి, మాడి రంగారెడ్డిల జ్ఞాపకార్థం పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ఎంట్రీ ఫీజు రూ.5వేలు కట్టి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. గెలుపొందిన విజేతకు లక్ష రూపాయలు, రన్నరప్‌కు రూ.50వేల నగదు బహుమతి, షీల్డ్‌లు అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని జట్లుకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్‌ నంబర్లు 7893122562, 9100144607, 99491 99140లను సంప్రదించాలని కోరారు.